క్లుప్తంగా

ఘనంగా దుర్గతల్లి విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన దుర్గతల్లి విగ్రహం

సీతానగరం: మండలంలోని కృష్ణారాయపురంలో నిర్మించిన దుర్గతల్లి గుడి, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా శనివారం జరిగింది. వేద మంత్రాల నడుమ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లి పండుగ

సీతానగరం: మండలంలోని రామవరంలో బోను కుటుంబానికి చెందిన యాదవ కులస్తుల ఆధ్వర్యంలో అగ్ని గంగమ్మ పండుగ శనివారం వైభవంగా జరిగింది. లోక కల్యాణార్థం యాదవ కులస్తులు గావు పండుగలు నిర్వహిస్తుంటారు. ఇందులో కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ముహూర్తపు రాట



సీతారాముల కల్యాణానికి వేస్తున్న ముహూర్తపు రాట

సాలూరు: పట్టణంలో మెంటాడ వీధి కోదండ రామమందిరంలో శ్రీరామనవమి రానున్న నేపథ్యంలో సీతారాముల కల్యాణానికి ముహూర్తపు రాటను శాస్త్రోక్తంగా శనివారం వేశారు. స్థానికంగా ఆధ్యాత్మికతతో సందడి నెలకొంది. కార్యక్రమంలో కోదండ రామమందిరం అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో దగ్ధం



దగ్ధమైన ఆటో

పాచిపెంట: మండలంలోని రాయిగుడ్డివలస సమీపంలో శుక్రవారం రాత్రి కొటికిపెంట గ్రామానికి చెందిన బాలి మాధవ్‌కు చెందిన ఆటోలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి, సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఘటన జరిగిన సమయంలో ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

శిక్షణ తరగతులు సద్వినియోగం కావాలి

సాలూరు: ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డీసీ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు శనివారం వచ్చిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. జిల్లాలో 5 నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అందులో భాగంగా సాలూరులో ఇంటర్మీడియెట్, ప్రభుత్వ ఐటీఐ పూర్తి చేసిన యువకులకు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, టు వీలర్ సరీ్వసెస్ అసిస్టెంట్ కోర్సులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు 90525 08903 నంబర్‌కు సంప్రదించి కోర్సుల్లో చేరవచ్చని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి రూ.20 లక్షల వితరణ



మాట్లాడుతున్న దాత వైష్ణవి

గరుగుబిల్లి: తోటపల్లిలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి విశాఖపట్నానికి చెందిన దాతలు మునగపాటి వైష్ణవి, వెంకట వర్మ తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో జరిగిన ఆలయ అభివృద్ధి డైరెక్టర్ల సమావేశంలో ఆలయ అభివృద్ధికి రూ.20 లక్షలు వితరణ చేస్తూ చెక్కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. మున్ముందు ఆలయ పూర్వ వైభవానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ డి.ధనుంజయరావు, కార్యదర్శి డి.పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో బహుళ ప్రయోజనాలు

● డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

పార్వతీపురం టౌన్:

చిరు ధాన్యాలతో బహుళ ప్రయోజనాలు కలుగుతాయని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. పార్వతీపురం మండల సమాఖ్య కార్యాలయంలో అంతర్జాతీయ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ కార్యక్రమంలో భాగంగా శనివారం జరిగిన గ్లోబల్ మిల్లెట్స్ ప్రమోషన్, ఎక్స్‌పెన్షన్ లైవ్ ప్రొగ్రాంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అపరాలు సాగు, చిరు ధాన్యాల పంటలను అధికంగా పండించాలని సూచించారు. వీటితో ఆరోగ్యంతో పాటు ఆదాయం కలుగుతుందన్నారు. చిరుధాన్యాలు విరివిగా సాగు చేసి ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. వీటిని సాగు చేసే రైతులకు పెట్టుబడికి సమాఖ్య ద్వారా రుణాలు ఇవ్వడం, పండించిన పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించనున్నట్టు తెలిపారు. చిరుధాన్యాల సాగు, వాటి ఉపయోగాలను వ్యవసాయ అధికారుల ద్వారా రైతులకు తెలియజేసి చైతన్యపరచాలన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించేలా సిబ్బంది వారికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీపీఎం పి.ప్రవీణ్‌కుమార్, ఏపీఎం పి.సురేష్, రైతు సమాఖ్య అధ్యక్షుడు, బోర్డు ఆఫ్ డైరెక్టర్‌లు, సీసీలు పాల్గొన్నారు. అంతకు ముందు చిరు ధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం సింహాచలం

ప్రజారోగ్యంలో చిరుధాన్యాల పాత్ర కీలకం

సాలూరు: ప్రజల ఆరోగ్యంలో చిరుధాన్యాల పాత్ర చాలా కీలకమైనదని వెలుగు ఏపీఎం గండిపల్లి సింహాచలం అన్నారు. మండలంలోని బొరబంద ఆర్‌బీకే వద్ద మహిళా రైతులతో ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. గ్లోబల్ మిల్లెట్స్ ప్రమోషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు మిల్లెట్స్ (చిరుధాన్యాలు) సాగును ప్రోత్సహించే క్రమంలో ఈ నెల 14 నుండి 25 వరకు మిల్లెట్స్ వారోత్సవాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని ఆర్‌బీకేల్లో వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రైతులు చిరుధాన్యాలు సాగు చేసే విధంగా వారికి అవగాహన పెంపొందించి ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు

● డీఐఓ డాక్టర్ జగన్‌మోహనరావు



వైద్య సిబ్బందిని టీకా వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు అందిచాలని డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని వెంకంపేట, చినబొండపల్లి గ్రామాలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు ఆకస్మికంగా శనివారం సందర్శించారు. పిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నదీ, లేనిదీ గృహ సందర్శనలు చేసి టీకా కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల వయసును బట్టి షెడ్యూల్ ప్రకారం ఇప్పటివరకు వేసిన టీకాల తేదీలను, తదుపరి వేయబోయే టీకా తేదీలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. పిల్లల తల్లిదండ్రులకు టీకా ఆవశ్యకతను వివరిస్తూ తదుపరి టీకా తారీఖున గుర్తుంచుకోవాలని, అదే విధంగా వైద్య సిబ్బంది తప్పనిసరిగా తల్లిదండ్రులకు ముందుగా తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా పిల్లలకు ఏవైనా ఆరోగ్య సమస్యలున్నాయా పిల్లల తల్లి దండ్రులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని అత్యవసర మందులు ఇంటి వద్దనే ఉంచుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సిబ్బందికి తెలియజేయాలని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. పిల్లల ప్రతి ఆరోగ్య కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో నిర్వహించి, వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని డీఐఓ జగన్‌మోహనరావు వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది కమలకుమారి, అరుణశ్రీ, పద్మావతి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు ఇళ్ల వద్దే వైద్య పరీక్షలు



రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఉషారాణి

సీతానగరం:

మండలంలోని ఆర్.వెంకంపేట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం డాక్టర్ పి.ఉషారాణి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. శిబిరంలో 65 మంది రోగులను తనిఖీలు చేసి నెలకు సరిపడ మందులను అందజేశారు. ఇదిలా ఉండగా వైద్యాధికారిణి ఉషారాణి మాట్లాడుతూ గర్భిణులకు ఇళ్ల వద్దే వైద్య పరీక్షలు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో చేస్తున్నట్టు చెప్పారు. గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ పి.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, ఆశ కార్యకర్తలు తమ సేవలు అందించారు.

ఓవర్ లోడ్ వాహనాలపై చర్యలు తప్పవు



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు

పార్వతీపురం టౌన్: ఓవర్ లోడ్ వాహనాలపై చర్యలు తప్పవని, రహదారి భద్రతా నియమాలను ప్రతీ ఒక్కరూ పాటించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై రోడ్డు భద్రతా, రక్షణ, అతివేగం వంటి విషయాలపై సంకేత బోర్డులతో అవగాహన కల్పించారు. రహదారిపై ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎక్కువ స్పీడ్‌తో వెళ్లరాదని, తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్‌లకు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచాలన్నారు. ఓవర్ లోడ్‌తో వాహనాలు నడవరాదని హెచ్చరించారు. సరుకు రవాణా వాహనాలలో ప్రజా రవాణా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజారావు సిబ్బంది కిషోర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



పాలకొండలోని పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ ప్రజారోగ్య శాఖ ఎస్‌ఈ రాజారావు

పాలకొండ:

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ప్రజారోగ్య శాఖ ఎస్‌ఈ రాజారావు తెలిపారు. శనివారం స్థానిక నగరపంచాయతీ పరిధిలోని పంప్‌హౌస్‌ను పరిశీలించిన ఆయన తాగునీటి సరఫరా, నిర్వహణపై ఆరాతీశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా జాగ్రత్త వహిస్తున్నామన్నారు. తాగునీటి వనరులను పునరుద్ధరించడంతో పాటు పాడైపోయిన బోర్ల మరమ్మతులు చేపడుతున్నామని, మరమ్మతులకు గురైన తాగునీటి పైపులైన్లను బాగు చేయిస్తున్నామన్నారు. రక్షిత మంచి నీటి పథకాల ద్వారా తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట విజయనగరం ఈఈ దక్షిణామూర్తి, మున్సిపల్ కమిషనర్ సర్వేశ్వరరావు, డీఈఈ కె.నరసింగరావు, ఏఈ దేవీవరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

సీతానగరం: మండలంలోని కురుస్తున్న అకాల వర్షాల నేపథ్యంలో వీఆర్‌ఓలు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎన్వీ రమణ శనివారం తెలిపారు. గ్రామాల్లో వీఆర్‌ఓలు, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. భారత వాతావరణ శాఖ వర్షాలు విస్తారంగా కురుస్తాయని హెచ్చరికలు చేసిన నేపథ్యంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో మూడు రోజుల కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్న ఆదేశాలతో తమ కార్యాలయంలో కంట్రోల్ రూం శనివారం ఏర్పాటు చేశామన్నారు. మూడు రోజుల పాటు ఇది అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎక్కడ ఎటువంటి విపత్తులు సంభవించినా, ఎటువంటి సమస్యలు వచ్చినా తహసీల్దార్ లేదా డిప్యూటీ తహసీల్దార్‌కు 91009 99907 నంబరుకు సంప్రదించాలని కోరారు.

కల్వర్టు సమస్య పరిష్కారానికి చర్యలు

సాలూరు: మండలంలోని మామిడిపల్లి జంక్షన్ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై గల కల్వర్టు సమస్య పరిష్కారం కోసం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించామని ఆర్అండ్‌బీ ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు.శ నివారం ఆయన మాట్లాడుతూ ఈ కల్వర్టు కింద పైపులైన్లు శిథిలావస్థకు చేరుకోవడంతో మురుగునీరు కల్వర్టు కింద నుండి వెళ్లడం లేదని, స్థానిక వీధుల్లో ఇళ్లల్లోకి మురుగునీరు వెళ్తుందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి సుమారు రూ.9 లక్షలతో ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ప్రజల ఇబ్బందులు దృష్ట్యా తాత్కాలిక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సర్పంచ్ సువ్వాడ శశికళకు కోరామన్నారు. కాగా కురుస్తున్న వర్షాలకు ఈ వర్షపు నీటితో పాటు మురుగునీరు శివాలయం రోడ్డు మీదకు చేరింది. ఈ నీటి గుండా వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డీఎంహెచ్‌ఓ పరిశీలన



విద్యార్థితో నులిపురుగు నివారణ మాత్రను వేయిస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

పాలకొండ: మండలంలోని అన్నవరం దగ్గరున్న డీఏవీ స్కూల్, తంపటాపల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం చేపట్టిన నులిపురుగు నివారణ మాత్రల పంపిణీని డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 ఏళ్లలోపు వయసు వారందరికీ డీవార్మింగ్ టాబ్లెట్లు(నులి పురుగు నివారణ మాత్రలు) వేయాలని సిబ్బందికి సూచించారు. జిల్లాలో శతశాతం డీవార్మింగ్ మాత్రల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్లకోమా వారోత్సవాలు



ర్యాలీలో వైద్యారోగ్య సిబ్బంది

సీతంపేట: మండల వ్యాప్తంగా కొన్నిరోజులుగా చేపడుతున్న ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. స్థానిక పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నచిన్న కంటి సమస్యలతో బాధపడుతున్న వారంతా ఆస్పత్రికి చేరుకుని, చికిత్స చేయించుకోవాలన్నారు. అందరూ చక్కని చూపు కలిగి ఉండాలన్నదే జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమ ముఖ్య లక్ష్యమన్నారు. దీనికోసం ఏటా గ్లకోమా వారోత్సవాలు చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకటరావు, రాజేష్, సీతారాం, రేఖ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

బలిజిపేట: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారిలో సృజనాత్మకతను వెలికితీయాలని ఎంఈఓ శ్రీనివాసరావు అన్నారు. పెదపెంకి ప్రాథమిక పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. పాఠశాల రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పలు ప్రశ్నలు వేశారు. జవాబులు రాబట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. నాణ్యమైన విద్యనందించాన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతానగరం: మండలంలోని జోగింపేట గిరిజన(స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్)ప్రతిభా విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు విద్యాలయ ప్రిన్సిపాల్ పి.వెంకటనాయుడు శనివారం తెలిపారు. పార్వతీపురం ఐటీడీఏ వారి ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, జోగింపేట (ప్రతిభా పాఠశాల) విద్యాలయంలో 2023 – 24 విద్యా సంవత్సరానికి 8వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. ఏప్రిల్ 18 లోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటీడబ్ల్యూ గురుకులం ఏపీ. జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు కన్వీనర్ ప్రిన్సిపాల్ 9490957218 నంబరు, ప్రిన్సిపాల్, ఎస్ఈఓ, జొగింపేట సెల్ నంబరు 9440103332, గురుకులం సెల్ ఇన్‌చార్జి సెల్ నంబరు 9490971090ను సంప్రదించాలని కోరారు.

చిరుధాన్యాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీఎం, మహిళలు

బలిజిపేట: చిరుధాన్యాలపై వైఎస్సార్ క్రాంతి పథం సంఘ సభ్యులచే అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఏపీఎం ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాలను వినియోగించాలని, పండిస్తున్న రైతులను గుర్తించి వారిని ప్రోత్సహించాలని, కొత్త రైతులను గుర్తించి వారిచే చిరుధాన్యాలు పండించే విధంగా అవగాహన కల్పించాలని, చిరుధాన్యాలను వినియోగించాలనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, సీసీలు పాల్గొన్నారు.

నెలకు రెండుసార్లు వైద్య పరీక్షలు



బందలుప్పిలో ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారి శ్రీకాంత్

పార్వతీపురం టౌన్: ప్రతీ గ్రామంలో నెలకు రెండుసార్లు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని బందలుప్పి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్య పరీక్షలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతీ నెలకు రెండుసార్లు నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో మంచాన పడి వున్న రోగుల వద్దకు వెళ్లి ఇళ్ల వద్దనే వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచి స్పందన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చాలి



చినబోగిలిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: మండలంలోని జగనన్న లేఅవుట్లలో నిర్మాణాలకు వివిధ శాఖల ద్వారా అందజేస్తున్న పథకాలను వినియోగించుకొని సొంతింటి కల నెరవేర్చకోవాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి అన్నారు. చినబోగిలి సచివాలయాన్ని శనివారం సందర్శించిన ఆయన అక్కడ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి స్థలం సమకూర్చడం, గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇల్లు మంజూరు చేయడం, వెలుగు ద్వారా స్వల్ప వడ్డీపై రుణం సమకూర్చడం, ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం జరిగిందన్నారు. లబ్ధిదారులకు ఇన్ని సౌకర్యాలు కల్పించినా నిర్మాణాలపై అలసత్వం వహించడం తగదన్నారు. సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వాహనాల వేలం రేపు

సాలూరు: వివిధ సారా కేసులలో పట్టుబడిన వాహనాలకు సోమవారం వేలం వేయనున్నట్లు పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సారా కేసుల్లో పట్టుబడిన రెండు ఆటోలు, నాలుగు ద్విచక్ర వాహనాలకు పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్పీ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

గరుగుబిల్లి: రక్తదానం ప్రాణదానంతో సమానమని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ బి.ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేయగా, ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యం పాడైపోతుందన్న అపోహ అందరిలో ఉందని, అటువంటి అపోహలు వీడాలన్నారు. మనం చేసే రక్తదానం ఒకరి ప్రాణాలు రక్షించడంతో పాటు వారి కుటుంబానికి అండగా నిలవడమవుతోందన్నారు. రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ ఎ.శ్యామ్, సర్పంచ్ ఎ. సింహాచలమ్మ, జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, ఎన్.ఎస్.ఎస్ అధికారి బి. హరిరామకుమార్ పాల్గొన్నారు.